క్లుప్తంగా

22న దంత వైద్యశిబిరం

సీటీఆర్ఐ: స్థానిక సంజీవయ్య నగర్‌లోని విశ్రాంత కలెక్టర్ జీఎస్ రావు భవనంలో ఈ నెల 22వ తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ దంత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. జూలీ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. మరిన్ని వివరాలకు 99493 29433, 77998 12004 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీటీఆర్ఐ: ధనుర్మాసం ప్రారంభం కావడంతో సోమవారం నుంచి శ్రీవారి ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నిత్య విశేష కార్యక్రమాలు, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రం, గోదావరి గట్టున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం, జమిందారుమెట్టలోని భూనీళా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, పారిజాత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు ప్రారంభించారు.

శంకుస్థాపన

కడియం: వేమగిరిలోని జక్కంపూడి నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.11 లక్షల అంచనా వ్యయంతో వీటిని నిర్మించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విలువిద్యలో బంగారు పతకం

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల విలువిద్య (ఆర్చరీ) పోటీల్లో 30 మీటర్ల విభాగంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి తేలం అజయ్ బంగారు పతకం సాధించాడు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ విభాగాధిపతి పీఏ కిషోర్ బాబు, జి.శరత్ బాబు, సంజీవరావు, విశ్వేశ్వరరావు తదితరులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

18న మైనారిటీ హక్కులపై సదస్సు

సీటీఆర్ఐ: మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న గీతా అప్సర థియేటర్ పక్కనే గల దర్గా షాదీఖానాలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సునీల్ కుమార్ మెల్లిమి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు హాజరవుతారన్నారు. మైనార్టీ నాయకులు, యువత, పెద్దలు తరలిరావాలని కోరారు.

23న షాపుల అద్దె వేలం

మధురపూడి: కోరుకొండలోని విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రానికి చెందిన షాపుల అద్దె హక్కు నిమిత్తం ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. సత్రం కార్యనిర్వాహణాధికారి జీవీ లక్ష్మీకుమార్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. 1-1-25 నుంచి 31-12-2028 వరకూ మూడేళ్ల కాలపరిమితికి వేలం జరుగుతుందన్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డులోని 142 చదరపు అడుగుల షాపునకు ధరావత్తుగా రూ.5 వేలు, 162 చదరపు అడుగుల షాపునకు ధరావత్తుగా రూ.4 వేలు చెల్లించాలన్నారు. అలాగే లక్ష రూపాయల సాల్వెన్సీ కట్టాల్సి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగానే దరావత్తు చెల్లించాలని తెలిపారు.

నర్సరీల ఫోన్ నంబర్లు

సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్	94403 18373
సత్యదేవ	93940 89571
వీరహనుమాన్	94401 76254
సత్యనారాయణ	93939 11199
అంబికా	93911 16111
వెంకటసూర్య	99596 97999
సత్యజానకి దుర్గ	93488 85859
విజయదుర్గా	93979 22226
సాయిరామకృష్ణ	94901 67345
శివపార్వతి	98496 95729
తారకజయలక్ష్మి	0883 2453496
ఓం సాయిరామ్	99637 15415
మురళీకృష్ణ	99089 89205
సత్య భాస్కర	94403 95494
వరలక్ష్మి	94403 32989
గౌతమి	94404 90209
దుర్గా ప్రసన్న	93463 14808
లక్ష్మీ	99633 46686
కేదార్‌నాథ్	99892 42413
రంగనాథ్	95736 22999
సాయిరామ్	97013 03991
సత్యసూర్య	94411 43695
జ్యోతి	98660 45378
సూర్యలక్ష్మి	94406 69084
శాంతి	98663 67899
దుర్గామణికంఠ	99497 55666
అనంతలక్ష్మి	98660 00339
వీర వెంకట సత్యనారాయణ	94408 64591
సాయిసత్య	91776 79597
రామాంజనేయ	99664 88419

అంతన్నారు.. ఇంతన్నారు

- మరమ్మతులతో సరిపెట్టేశారు
- కడియం – వేదురుమూడి రోడ్డుకు ప్యాచ్ వర్క్
- పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో స్థానికుల ఆవేదన



వీరవరం - దుళ్ల రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులు

కడియం: వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారి గోతులమయంగా మారింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారని ఆశలు పెట్టుకున్నారు. ఎందుకంటే ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక వాగ్దానాలు చేశారు. మండలంలో అన్ని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, విస్తరిస్తామని హామీలు గుప్పించారు. కానీ ప్రస్తుతం ఆ రోడ్డులపై గోతులను మాత్రమే పూడ్చుతుండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై తూతూమంత్రంగా చేపట్టిన మరమ్మతులతో ఉపయోగం ఉండదన్నారు. మండల కేంద్రమైన కడియం నుంచి దుళ్ల మీదుగా వెదురు మూడు వెళ్లే రోడ్డు పరిస్థితి ఇది.

వాహనాల రద్దీ

కడియం నుంచి సుమారు తొమ్మిది కిలోమీటర్ల వరకూ ఉండే ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా వీరవరం నుంచి దుళ్ల వరకూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా నర్సరీలు ఇటీవల భారీగా ఏర్పాటయ్యాయి. సాధారణ ప్రయాణికులతో పాటు నర్సరీ మొక్కల లోడు వాహనాలతో ప్రతి నిత్యం ఈ రోడ్డు జాతీయ రహదారిపై ఉండే రద్దీని తలపిస్తుంటుంది.

గోతులమయం

ఈ రహదారిని నిర్మించి దాదాపు 20 ఏళ్లు అవుతుంది. ప్రస్తుతం గోతులతో ప్రయాణానికి వీలు లేకుండా మారింది. ఈ రోడ్డును పునర్నిర్మించాలని, వెడల్పు చేయాలని గతంలో పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. కాగా.. ఇటీవల సుమారు రూ.24 లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం గుంతలు పూడ్చే పనులు సాగుతున్నాయి. అంటే రోడ్డును పునర్నిర్మించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతుంది. ప్రస్తుతం గోతులను పూడ్చుతున్నారని, వాహనాల రద్దీ కారణంగా అవి మళ్లీ మొదటికి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో రోడ్డును నిర్మిస్తే కొన్నాళ్లపాటు వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

ఎంతో కీలకం

కడియం, మండపేట, ఆలమూరు మండలాలకు ఈ రహదారి లింకు రోడ్డుగా ఉపయోగపడుతోంది. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రతి నిత్యం మూడువేలకు పైగా వాహనాలు వివిధ దశల్లో ప్రయాణిస్తుంటాయని పదేళ్ల క్రితమే అంచనా వేశారు. ఇప్పుడు మరింత రద్దీ పెరిగింది. మండపేట రూరల్ మండలం, ఆలమూరు మండలంలోని కొన్ని గ్రామాల వారు రాజమహేంద్రవరం రావడానికి ఈ రోడ్డునే ప్రధానంగా వినియోగిస్తుంటారు. ఇతర రోడ్ల వెంబడి ప్రయాణిస్తే దూరాభారం అవుతున్న నేపథ్యంలో ఈ రోడ్డు కీలకంగా ఉంటుంది.

అవస్థలు పడుతున్నాం

దాదాపు ఏడెనిమిదేళ్లుగా గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డును పునర్నిర్మిస్తున్నారంటే సంతోష పడ్డాం. కానీ ఇప్పుడు మరమ్మతులు మాత్రమే చేస్తున్నారు. ఇవి ఎన్నాళ్లు ఉంటాయో తెలియదు. రోడ్డును పునర్నిర్మిస్తేనే ఉపయోగంగా ఉంటుంది. కొన్నాళ్ల పాటు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

– కేవీ సత్యకుమార్, దుళ్ల

ఉపయోగం ఉండదు

కడియం నుంచి వీరవరం మీదుగా దుళ్ల వరకూ రోడ్డు బాగా దెబ్బతింది. గతంలో కంటే భారీ వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇతర వాహనాల రద్దీ కూడా పెరిగిపోయింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో పలు చోట్ల ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం చేస్తున్న మరమ్మతులతో ఉపయోగం ఉండదు.

– జి.వీర వెంకట సత్యనారాయణ, వీరవరం

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు మహాలక్ష్మి

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థిని మహాలక్ష్మి యూనివర్సిటీ ఆఫ్ కాలికాట్‌లో జరిగే సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని కళాశాల పీఈడీ సుధారాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ కం యూనివర్సిటీ ట్రయిల్స్‌లో మహాలక్ష్మి ప్రతిభ చూపిందన్నారు. ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్ రాఘవ కుమారి, వైఎస్ ప్రిన్సిపాల్ రత్నకుమార్ అభినందించారు.

పాఠశాల నిర్వహణను మెరుగుపర్చాలి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నిర్వహణను మరింత మెరుగుపర్చాలని ప్రధానోపాధ్యాయురాలు, వసతిగృహం వార్డెన్‌కు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ సూచించారు. ఆయన సోమవారం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదిలో కుళ్లిన కూరగాయలు, సిక్‌రూమ్‌లో బెడ్, ఫ్యాన్ లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం, సుమారు 50 సిమెంట్ బస్తాలు గడ్డకట్టి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని హెచ్‌ఎం, వార్డెన్‌లను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం విద్యార్థినులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జరిగిన ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, స్పెషల్ ఆఫీసర్ భాస్కరరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎంఆర్ఐ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, సిటీ స్కాన్ ఆపరేట్ చేయడానికి రేడియాలజిస్టును ఏర్పాటు చేస్తామన్నారు. బయో వ్యర్థాలను కాల్చకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ఆసుపత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఒక ప్రొఫెసర్, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్ఎంవోగా ఒక సీఎంవో సేవలను ఉపయోగిస్తున్నామన్నారు. లాండ్రీ డిపార్ట్‌మెంటుకు వినియోగిస్తున్న ఐఎఫ్‌బీ వాషింగ్ మెషీన్ మరమ్మతులు, అన్ని విభాగాలకు బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌కామ్ సేవలను అందించడం, 2022 అక్టోబర్ 1 నుంచి 2024 నవంబర్ 30 వరకు ఎన్టీఆర్ వైద్యసేవ – హెచ్‌డీ నుంచి చేసిన ఖర్చుల ధ్రువీకరణ, ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ.. ఆసుపత్రికి అవసరమైన పలు విషయాలపై తయారు చేసిన అజెండా పాయింట్లను సమావేశంలో చర్చించి, వాటి పరిష్కారానికి తీర్మానాలు చేశారు. సమావేశంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు కేబుల్ మురళి, అనూప్ జైన్, ఉమా, గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాజెక్టుల పేరుతో రూ.57.75 లక్షలకు టోకరా

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని చెప్పి రూ.57.75 లక్షలను దఫదఫాలుగా కాజేశారని బొమ్మూరులోని వెంకట గార్డెన్స్‌కు చెందిన చింతకాయల సోమేష్ బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన చింతకాయల సోమేష్ ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం బొమ్మూరులో నివసిస్తున్నాడు. అతడికి పరిచయమైన ఆకుల సౌజన్య, ఆకుల శ్రీనివాస్, అజ్జరపు సునీల్ ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని నమ్మబలికారు. దీంతో వారి బ్యాంకు ఖాతాలకు దఫదఫాలుగా రూ.57.75 లక్షలను సోమేష్ జమ చేశాడు. అనంతరం ప్రభుత్వ ప్రాజెక్టులు మంజూరయ్యాయంటూ వారు లెటర్లు కూడా ఇచ్చారు. అయితే అవి ఫేక్ అని తేలడంతో తన సొమ్మును తిరిగి ఇచ్చేయ్యాలని సోమేష్ అడిగాడు. దానికి వారు సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 నుంచి కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం



కనకదుర్గమ్మ



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్

కడియం: కడియం – వీరవరం వెళ్లే రోడ్డులోని నర్సరీల మధ్య కొలువైన కనకదుర్గమ్మవారి తీర్థ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద భారీ విద్యుద్దీపాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కడియం, రాజమహేంద్రవరం రూరల్, ఆలమూరు, మండపేట మండలాల ప్రజలు ఈ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తీర్థ మహోత్సవం అనంతరం ఈ నెల 25న భారీ అన్నసమారాధనను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ధవళేశ్వరం: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో జనం జేబులకు చిల్లులు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం ధవళేశ్వరంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. రాజమహేంద్రవరం నగర కార్యదర్శి కె.రామకృష్ణ, ధవళేశ్వరం గ్రామ కార్యదర్శి పడాల రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే ప్రజలపై విద్యుత్ భారం మోపిందన్నారు. తమను గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి రాగానే ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపారన్నారు. నిరసనలో పేరయ్య లింగం, బీఎస్ ప్రకాష్, డి.శ్రీను, సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం నగర్: విద్యుత్ సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక శ్యామలా సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.11 వేల కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం సరికాదన్నారు.

రెవెన్యూ సదస్సులతో వివాదాల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయసూర్యకుమార్, చిత్రంలో డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి

రాజమహేంద్రవరం రూరల్: భూవివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి అన్నారు. ధవళేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ సదస్సుకు 12 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని 45 రోజుల్లో నిబంధనల మేరకు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

కంబాలచెరువు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో 16 మందితో స్థానిక ఆర్ట్స్ కళాశాల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.శివ బాలాజీ, కె.సురేష్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అధ్యయనం-పోరాటం అనే నినాదంతో ముందుకు వెళతామన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజు మాట్లాడుతూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

షెడ్యూల్ తెగల సమస్యలను పరిష్కరిస్తాం



వేమగిరిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

కడియం: రాష్ట్రంలో అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ 34 రకాల షెడ్యూల్ తెగల ప్రజలు ఉన్నారని, వారందరి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కడియం మండలం వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్టీ కుల పెద్దలతో సమావేశం నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కేఎన్ జ్యోతి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీల సమస్యలను శంకర్ నాయక్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, పిల్లల్ని బాగా చదివించాలని, చెడు అలవాట్లు, వ్యసనాల బారిన పడకుండా పర్యవేక్షణ చేయాలన్నారు.

సమస్యలపై పలు అర్జీలు

ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్‌కు స్థానికులు పలు అర్జీలు అందజేశారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, తమ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలని, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని కోరారు. తమ కులదైవమైన ఏకలవ్యుడు విగ్రహాన్ని వేమగిరి సెంటర్, కడియపులంకలో ఏర్పాటుకు సహకరించాలని, కడియపులంకలో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు.

బీరువాలో రూ.98 వేలు మాయం

రాజమహేంద్రవరం రూరల్: పెంట్ హౌస్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.98 వేలు చోరీ చేశారని వీఎల్‌పురానికి చెందిన పిల్లా చాందిని కాంతాదేవి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఈ నెల 3వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. తర్వాత రోజు ఉదయం నిద్ర లేచి పైన ఉన్న పెంట్‌హౌస్‌లోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. గమనించగా బీరువాలోని రూ.98 వేలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శివార్చన



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివార్చన నిర్వహించారు. వేకువజామున మూడు గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. ఆలయ ఈఓ పెదిపూడి రాజబాబు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి నీలకంఠశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శివాలయాల్లో అభిషేకాలు

కడియం: మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం శైవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి, దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరాలయం, జేగురుపాడు, వీరవరం, మురమండ, వేమగిరి, పొట్టిలంక, మాధవరాయుడుపాలెం శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

లక్ష్యసాధనకు నిరంతర కృషి



జీఎస్ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న స్కూలు యాజమాన్యం



ఆకట్టుకున్న శ్రీరామ పట్టాభిషేకం

- రుడా ఛైర్మన్ వెంకట రమణ చౌదరి
- ఘనంగా జోష్ 2024

రాజానగరం: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు నిరంతర కృషి చేయాలని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ 12వ వార్షికోత్సవాన్ని జోష్ 2024 పేరిట సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుడా ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, దేశం గర్వించే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథి, జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రధానమైనదన్నారు. ఆ దశలో నడవడిక, కార్యాచరణే భవితకు పునాదులవుతాయన్నారు. ఐఏఎస్ ట్రైనర్, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కష్టాలను తెలిసేలా పిల్లలను పెంచాలని, గారాబం చేస్తే వారి భవిష్యత్తుకు నష్టం చేసిన వారవుతారన్నారు. విద్యానికేతన్ కరస్పాండెంట్ సీహెచ్ విజయ ప్రకాష్ 12 ఏళ్ల ప్రయాణానికి సంబంధించిన నివేదికను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, పాటలు, నృత్యాలతో అలరించారు. వారు ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం



కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్ఓ సీతారామమూర్తి తదితరులు



అర్జీలు తీసుకుంటున్న ఆర్డీఓ కృష్ణనాయక్



కార్పొరేషన్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

సీటీఆర్ఐ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు డీఆర్ఓ టి.సీతారామమూర్తి సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి డీఆర్వో సీతారామమూర్తి అర్జీలను స్వీకరించారు. కాగా.. ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో 119 అర్జీలు వచ్చాయి. సీపీఓ ఎల్.అప్పలకొండ, డీఎల్‌డీవో వీణాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిశీలించి ఫిర్యాదుదారుడికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఏడు అర్జీలను అందించారు.

నగరపాలక సంస్థలో..

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయి. వాటిని నిబంధనల మేరకు పరిష్కరిస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్ అన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు విద్యుత్ పొదుపు ప్రాముఖ్యతలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. చిన్నారుల్లోని సృజనాత్మకత, ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన ఉత్సవాల ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.